ప్రజాశక్తి

బుధవారం 10 ఏప్రిల్ 2024

I

అల్లూరి సీతారామరాజు

ఆప్కాస్ ద్వారా వేతనాలు చెల్లించండి

ప్రజాశక్తి- పెదబయలు : ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకులాల్లో విధులు నిర్వర్తిస్తున్న ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులకు ఆప్కాస్ ద్వారా తక్షణమే వేతనాలు చెల్లింపునకు రాష్ట్ర ప్రభుత్వంచర్యలు చేపట్టాలని ఉద్యోగ సంఘ రాష్ట యూనియన్ నాయకులు శాఖిర్ బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. చాలీచాలని వేతనాలతో ఏళ్ల తరబడి పనిచేస్తున్న వీరికి అకారణంగా ఎన్నికల సమయంలోనూ జీతాలను నిలుపుదల చేయడం సరికాదన్నారు. గడచిన ఐదేళ్లలో వీరి వేతనాన్ని ఒక్క పైసా పెంచకపోగా, గెలిస్తే కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామన్న హామీని సిఎం జగన్ గాలికొదిలేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐటిడిఎ పరిధిలో పనిచేస్తున్న సిఆర్‌టిలు, కస్తూర్బా పాఠశాలల్లోని ఉపాధ్యాయులను రెగ్యులర్ చేసిన ప్రభుత్వం, గురుకులాల్లోని కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులను విస్మరించడం, వివక్ష చూపడంపై ఆవేదన వెలిబుచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి మార్చి నెల వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు

ఉద్యమ సారథులు.. సిపిఎం అభ్యర్థులు

- ★ అరకు, రంపచోడవరం, గాజువాక అసెంబ్లీ స్థానాల నుంచి గంగరాజు, రామారావు, జగ్గునాయుడు పోటీ
- ★ అరకు పార్లమెంట్ బరిలో అప్పలనర్స

కార్మిక చైతన్యానికి, ఆదివాసీల పోరు స్ఫూర్తికి నిదర్శనంగా నిలిచిన ఉమ్మడి విశాఖపట్నం జిల్లా నుంచి సిపిఎం పోరాట సారథులను ఎన్నికల బరిలో నిలిపింది. ఈ క్రమంలో విశాఖ జిల్లాలోని కార్మికవాడ గాజువాక నియోజకవర్గం నుంచి మరడాన జగ్గునాయుడు, అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకు నియోజకవర్గం నుంచి దీసరి గంగరాజు, రంపచోడవరం నియోజకవర్గం నుంచి లోతా రామారావు ఎమ్మెల్యే అభ్యర్థులుగా బరిలో దిగుతున్నారు. అరకు పార్లమెంట్ స్థానం నుంచి పాచిపెంట అప్పలనర్స పోటీ చేస్తున్నారు. వారి అభ్యర్థిత్వాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సోమవారం ప్రకటించారు. ఎన్నికల పోరులో నిలిచిన అభ్యర్థులంతా సుదీర్ఘ ఉద్యమానుబంధం కలిగినవారు. ప్రజా సంఘాలకు నేతృత్వం వహించినవారు. ఎర్రజెండాను చేతబూని కార్మిక, కర్షకులకు, ఆదివాసీలకు విజయాలు సాధించి పెట్టిన వారు.

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, అరకులోయ, పాడేరు, రాజవొమ్మంగి విలేకరులు

అరకు ఎంపీ అభ్యర్థిగా అప్పలనర్స

అరకు లోక్‌సభ (ఎస్‌టి రిజర్వుడ్) నియోజకవర్గం నుంచి సిపిఎం అభ్యర్థిగా ఆదివాసీ ఉద్యమ నేత పాచిపెంట అప్పలనర్స పోటీ చేస్తున్నారు. ఆయన ప్రస్తుతం సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శిగా, ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ కార్యవర్గ సభ్యునిగా, ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షునిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. 1983లో అరకులోయ మండలం బొండం గ్రామంలో జన్మించారు. గిరిజన రైతు కుటుంబంలో జన్మించిన అప్పలనర్స విద్యార్థి దశ నుంచి ఉద్యమ నేతగా ఎదిగారు. ఈ ప్రాంతంలో గిరిజన విద్యార్థుల సమస్యలపై పోరాటాలు సాగించారు. 1998 నుంచి 2008 వరకు విద్యార్థి సంఘమైన ఎస్ఎఫ్ఐ నాయకునిగా ఉన్నారు. ఎస్ఎఫ్ఐ పాడేరు డివిజన్ అధ్యక్షునిగా, కార్యదర్శిగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా, జాతీయ కార్యవర్గ సభ్యునిగా పని చేశారు. 2011 నుంచి గిరిజన సంఘం విశాఖ జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టి గిరిజన హక్కుల పరిరక్షణ కోసం, గిరిజన చట్టాల పరిరక్షణ కోసం పోరాటాలు చేశారు. 2017లో గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. పలు గిరిజన ఉద్యమాలకు నేతృత్వం వహించారు. తన ఉద్యమ ప్రస్థానంలో 15 రోజులపాటు జైలు జీవితం గడిపారు. 2013 లో హుకుంపేట మండలంలో ఆదివాసీలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని నిర్వహించిన భూపోరాటంలో కీలకపాత్ర పోషించారు. 1998 నుంచి 2000 వరకు గిరిజన విద్యార్థులకు కళాశాలల్లో ఉచిత అడ్మిషన్ కల్పించాలని, డిగ్రీ, జూనియర్ కళాశాలలు ప్రతి మండలంలో ఏర్పాటు చేయాలని ఉద్యమించారు. 2003లో ఎంవిఎస్.శర్మ నాయకత్వంలో 25 రోజుల పాటు జరిగిన ఏజెన్సీ ప్రాంత సమగ్రాభివృద్ధి పాదయాత్రలో పాల్గొన్నారు. 2008లో విద్యార్థుల మెస్ ఛార్జీలు పెంపుదల కోసం నాటి రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ఏడు రోజులు నిరాహార దీక్ష చేపట్టారు. 2009లో విద్యార్థుల సమస్యలు పరిష్కారానికి విశాఖ జిల్లాలో 30 రోజులపాటు సైకిల్ యాత్ర జరిపారు. అంటరానితనాన్ని రూపుమాపడానికి జరిగిన సైకిల్ యాత్రలో పాల్గొన్నారు. ఆదివాసీలకు స్పెషల్ డిఎస్‌సి నిర్వహించాలని 2010 నుంచి నేటి వరకూ ఉద్యమాలు నడుపుతూ వస్తున్నారు. విజయాలు సాధించారు. 2011లో కొండ కుమ్మర్లను ఎస్‌టి జాబితాలో చేర్పించాలని ఉద్యమం నిర్వహించారు. పారా మెడికల్ సిబ్బంది సమస్యలపైనా, సిహెచ్‌డబ్ల్యుల సమస్యలపైనా ఉద్యమించారు. బోయ/వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చడాన్ని నిరసిస్తూ పోరాటాలు చేపట్టారు. నాటి భారత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు వినతిపత్రం సమర్పించడానికి వెళ్లిన ప్రతినిధి బృందానికి నాయకత్వం వహించారు. బాక్సైట్ పోరాటంలో కీలక భూమిక పోషించారు. కాఫీ రైతులు, మాతృభాషా వాలంటీర్ల సమస్యలపైనా ఉద్యమించారు. జిఒ 3 పునరుద్ధరణ కోసం న్యాయపోరాటం సాగిస్తున్నారు. 41 సంవత్సర అప్పలనర్స ఎంఎ చదువుకున్నారు. తల్లిదండ్రులు పెద్ద అప్పలస్వామి, గంగమ్మ, భార్య గంపరాయి దేవమణి గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా పనిచేస్తున్నారు.

పి.అప్పలనర్స

అరకు అసెంబ్లీ అభ్యర్థిగా గంగరాజు

సిపిఎం అరకు అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న దీసరి గంగరాజు ప్రస్తుతం అనంతగిరి మండల జెడ్‌పిటిసి సభ్యులుగా ఉన్నారు. ఆయన విద్యార్థి దశ నుంచీ పోరాటంలో ఉన్నారు. అనంతగిరి మండలం అనంత గిరి పంచాయతీ రాజుపాక గ్రామానికి చెందిన ఆయన ప్రస్తుతం అనంతగిరి మండల కేంద్రానికి సమీపంలోనున్న బొడ్డ చెట్టు కాలనీలో నివాసం ఉంటున్నారు. 1980 జూన్ 1న జన్మించారు. డిగ్రీ వరకూ చదువుకున్నారు. వృత్తిరీత్యా వ్యవసాయ కుటుంబం. సిపిఎం పూర్తిస్థాయి కార్యకర్తగా పనిచేస్తున్నారు. గంగరాజు ఆదర్శ ప్రజాప్రతినిధిగా గుర్తింపునొందారు. ఆయన తండ్రి దీసరి లచ్చు అనంతగిరి పంచాయతీ సర్పంచ్‌గా 1987 నుండి 1992 వరకు పనిచేశారు. గంగరాజు విద్యార్థి సంఘంలో పనిచేస్తూ 1998-99 కాలంలో గిరిజన సంఘంలో చేరారు. సిపిఎంలో 2000లో చేరారు. అనేక పోరాటాలకు నేతృత్వం వహించారు. కులమతాలకు అతీతంగా పని చేస్తూ అందరి మన్ననలూ పొందారు. 2012లో అనంతగిరి నుంచి జిసిసి డైరెక్టర్‌గా ఎన్నికయ్యారు. 2014లో జరిగిన స్థానిక ఎన్నికలలో ఎంపిటిసిగా పోటీ చేసి టిడిపి, వైసిపిలను ఓడించి సిపిఎం ఎంపిటిసిగా గెలుపొందారు. 2021లో సిపిఎం జెడ్‌పిటిసి అభ్యర్థిగా పోటీ చేసి వైసిపి, టిడిపిలను ఓడించి విజయఢంకా మోగించారు. జిల్లా పరిషత్ సమావేశాల్లో, పాడేరు ఐటిడిఎ పాలకవర్గ సమావేశాల్లో గిరిజనుల వాణిని వినిపిస్తున్నారు. అనంతగిరి మండలం బొర్రా పంచాయతీలో అర్హులందరికీ పట్టాలు ఇవ్వాలని పోరాడి జైలు జీవితం గడిపారు. 2005లో గిరిజనుల మనుగడను దెబ్బతీసే బాక్సైట్ తవ్వకాలను నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ అనంతగిరి మండలం వలసి నుంచి పాదయాత్ర ప్రారంభించి ఏజెన్సీ ప్రాంతమంతా తిరిగి విశాఖ కలెక్టరేట్‌కు చేరుకున్నారు. నాన్ షెడ్యూల్డ్ ఏరియాలో ఉన్న గిరిజన పంచాయతీలను షెడ్యూల్డ్ ఏరియాలో చేర్పించాలని 2007 నుంచి పోరాటం నిర్వహిస్తున్నారు. ఆదర్శ ప్రజా ప్రతినిధిగా పేరుగాంచిన ఆయన ఇప్పటికే అరకు నియోజకవర్గంలో ప్రచారంలో దూసుకుపోతున్నారు.

లోతా రామారావు

దీసరి గంగరాజు

రంపచోడవరం అభ్యర్థిగా లోతా రామారావు

రంపచోడవరం నియోజకవర్గం నుంచి సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో ఉన్న యువకుడు లోతా రామారావు. కాంగ్రెస్, ఆమ్‌ఆద్మీ, వామపక్షాలు బలపరుస్తున్న సిపిఎం అభ్యర్థిగా ఆయన ఇప్పటికే ప్రచారం జోరుగా చేస్తున్నారు. రాజవొమ్మంగి మండలం లోదొడ్డి పంచాయతీ కేశవరం గ్రామానికి చెందిన రామారావు 1991లో జన్మించారు. తల్లిదండ్రులు బాలరాజు, గౌరమ్మ. వీరిది వ్యవసాయ కూలీ కుటుంబం. 2015లో రామారావుకు వెంకటలక్ష్మితో వివాహమైంది. రామారావు 2005లో సిపిఎంలో చేరారు. 2008లో రాజవొమ్మంగి మండల కమిటీ సభ్యునిగా ఎన్నికయ్యారు. ఆ తరువాత పలు పోరాటాలు సాగించారు. ప్రస్తుతం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శివర్గ సభ్యునిగా పనిచేస్తున్నారు. 2006 గిరిజన సంఘం మండల కమిటీ సభ్యునిగా ఎన్నికైన ఆయన నేడు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా కొనసాగుతున్నారు. ఏజెన్సీలో యువజన, విద్యార్థి సంఘాల్లో పనిచేశారు. 2018 నుంచి 2021 వరకూ సిఐటియు జిల్లా కార్యదర్శిగా కొనసాగారు. 2013, 2022ల్లో జరిగిన ఎన్నికల్లో లోదొడ్డి పంచాయతీ సర్పంచ్‌గా రామారావు ఘన విజయం సాధించారు. గ్రామంలో సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. ముఖ్యంగా లోదొడ్డి గ్రామానికి సుమారు 14 కిలోమీటర్ల రోడ్డును సాధించారు. దని నిర్మాణానికి ఫారెస్ట్ అధికారులు నిరాకరించడంతో పోరాటాలు చేసి ఫారెస్ట్ క్లియరెన్స్ కూడా పొందారు. పంచాయతీలోని కొండమీద ఉన్న కిండంగి గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఉద్యమించి విజయం సాధించారు. ఆ గ్రామంలోని కొండపోడు భూములకు పట్టాలను ఇప్పించారు. పంచాయతీలోని నాలుగు గ్రామాలకు మెటల్ రోడ్లు వేయించారు. ప్రభుత్వ నిర్ణయం ప్రకారం గ్రామ సచివాలయం ఏర్పాటు చేయాలంటే రెండు వేల మంది జనాభా ఉండాల్సి ఉంది. అయితే లోదొడ్డి పంచాయతీలో 1050 మంది మాత్రమే ఉన్నారు. దీంతో ఆ పంచాయతీకి సచివాలయం రాలేదు. అయితే అక్కడి పరిస్థితులను రామారావు అప్పటి జిల్లా కలెక్టర్‌కు తెలియజేసి సచివాయం ఏర్పాటు చేయించారు. 2006లో పోడు భూముల కోసం జరిపిన పోరాటాల్లో రామారావు కీలకపాత్ర పోషించారు. గత టిడిపి, ప్రస్తుత వైసిపి ప్రభుత్వాల హయాంలో గిరిజనుల సమస్యలపై ఆయన అనేక పోరాటాలు నిర్వహించారు. తీవ్ర నిర్బంధాన్ని ఎదుర్కొన్నారు. బోయ/వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో కలపడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. జిఒ 3 పునరుద్ధరణ కోసం ఏజెన్సీ అంతటా సాగుతున్న పోరాటంలో కీలక భూమిక పోషిస్తున్నారు. పోలవరం నిర్వాసితుల పక్షాన ఆయన పోరాడుతున్నారు. విఆర్.పురం, కూనవరం, ఎటపాక, చింతూరు ప్రాంతాల్లో నిత్యం పర్యటిస్తూ ఆదివాసీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు.



ఎం.జగ్గునాయుడు

గాజువాక అభ్యర్థిగా జగ్గునాయుడు

విశాఖ జిల్లాలోని గాజువాక అసెంబ్లీ స్థానం నుంచి సిపిఎం అభ్యర్థిగా పోటీ చేస్తున్న జగ్గునాయుడు 1985 నుంచీ కార్మికునిగా, కార్మిక నాయకునిగా ప్రజా సమస్యలపై అంకితమై పనిచేస్తున్నారు. ప్రస్తుతం సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి బాధ్యతల్లో ఉన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో పలు కార్మికోద్యమాలు, ప్రజా పోరాటాల్లో కీలక భూమిక పోషించారు. గాజువాక, మల్కాపురం కేంద్రాలుగా అనేక ఉద్యమాలు నడిపారు. విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఛైర్మన్‌గా, స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ ఉపాధ్యక్షులుగా, హెచ్‌పిసిఎల్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులుగా, షిప్‌యార్డు రక్షణ రంగం కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులుగా, విశాఖ పోర్టు గొడౌన్స్ అండ్ ఆల్ రైల్వే సైడింగ్స్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులుగా, సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేసి అనేక పోరాటాలకు నాయకత్వం వహించారు. సేవా కార్యక్రమాల్లోనూ చురుకైన పాత్ర పోషించారు. హుదూద్ తుపాను, కరోనా, అగ్ని ప్రమాదాలు, ఎల్‌జి పాలిమర్స్ విస్ఫోటనం, ఫార్మా కంపెనీలు, హెచ్‌పిసిఎల్ పరిశ్రమల్లో గతంలో ప్రమాదాల జరిగిన సందర్భాల్లో అక్కడి బాధితులకు సేవలందించారు. కావాల్సిన సహాయాన్ని అందించారు. నగరంలో పలుచోట్ల ఉచిత వైద్యశిబిరాలు, ట్యూషన్ సెంటర్లు, కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేయించారు. గాజువాక ప్రాంతంలో ప్రత్యేక కృషి సలిపారు. గాజువాక బానోజీతోట, మల్కాపురం, అచ్చింనాయుడుతోట తదితర ప్రాంతాల్లో భూ పోరాటాలు నిర్వహించారు. భూములను కాపాడటం, పేదలకు ఇళ్ల సాధన కోసం కృషిచేశారు. అలాగే గాజువాక ఇనాం భూముల పోరాటంలో చురుకైన పాత్ర పోషించారు. గాజువాక ప్రాంతంలో అదానీ గంగవరం పోర్టు కాలుష్యాన్ని అరికట్టి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని ఉద్యమించారు. షీలానగర్ వద్ద సూపర్ స్పెషాలిటీ ఇఎస్ఐ ఆసుపత్రి సాధనకు కృషి చేసి నిర్మాణ అనుమతులు సాధించారు. గాజువాక, పశ్చిమ నియోజకవర్గంలోగల పలు పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉద్యోగ, ఉపాధికై జరిగిన ఆందోళనల్లో ఆయనది కీలకపాత్ర. విశాఖ ప్రజలపై ప్రభుత్వాలు మోపిన ఆస్తి, చెత్త పన్నులకు వ్యతిరేకంగా పోరాడారు. ప్రత్యేక హోదా, రైల్వే జోన్ సాధన పోరాటాల్లోనూ కీలకంగా వ్యవహరించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉత్తరాంధ్ర ప్రజల మద్దతును కూడగట్టేందుకు ఉమ్మడి ఉత్తరాంధ్రలో జరిగిన బైక్ యాత్ర, నిరాహారదీక్షల్లో పాల్గొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకై పోరాటం సాగించారు. ప్రజా పోరాటాల సందర్భంగా తీవ్ర నిర్బంధం ఎదుర్కొన్నారు.

పేదల పప్పులకూ ఎసరు!

- రేషన్‌డిపోల్లో పంపిణీకి నోచుకోని కందిపప్పు
- గత కొన్ని నెలలుగా ఇదే పరిస్థితి

ప్రజాశక్తి-పాడేరు టౌన్: పేదల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని, వారికి అవసరమైన అన్ని వసతులు కల్పించేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని గొప్పలు చెప్పుకునే జగన్ సర్కారు పేదలకు అందించే నిత్యావసరాల్లో కోతలు విధిస్తూ వారిపై ఆర్థిక భారం మోపుతోంది. బహిరంగ మార్కెట్‌లో ఉప్పు నుంచి పప్పుల వరకు అన్ని రకాల నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్న నేటి పరిస్థితుల్లో ఏ సంక్షేమ ప్రభుత్వమైనా అడ్డుఅదుపు లేకుండా పెరుగుతున్న ధరలకు అడ్డుకట్ట వేస్తుంది. ఆ దిశగా పటిష్ట చర్యలు చేపడుతుంది. రాయితీ తానే భరించి పేదలకు సరుకులు సక్రమంగా అందేలా చూస్తుంది.కానీ రాష్ట్రంలో మాత్రం అందుకు భిన్నమైన పరిస్థితులున్నాయి. రేషన్ సరుకులు పంపిణీ చేసే ఎండియు వాహనాల ద్వారా కేవలం బియ్యం మాత్రమే పంపిణీ చేస్తుండగా,కొన్ని నెలల నుంచి కందిపప్పుకు ఎసరు పెట్టేశారు.ఉగాది పండుగ సందర్భంగా ఈనెలలోనైనాకందిపప్పు, ఇతర సరుకులు రాయితీపై ఇస్తారేమోనని ఎదురుచూసిన పేద రేషన్‌కార్డు లబ్ధిదారులకు నిరాశ తప్పలేదు. నెలల తరబడి కందిపప్పు ఇవ్వకపోయినా, కనీసం ఏప్రిల్ నెలలో ఉగాది పండుగ ఉందని అయినా, లేకుంటే వచ్చే నెలలో జరగనున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అయినా రేషన్ బియ్యంతోపాటు కందిపప్పు ఇస్తారనుకున్న కార్డుదారులకు భంగపాటు తప్పలేదు. పండుగ రోజైనా పప్పన్నం తినే భాగ్యం పేదలకు లేకుండా చేశారంటూ ప్రభుత్వంపై మండిపడుతున్నారు. బహిరంగ మార్కెట్‌లో కిలో కందిపప్పు ధర రూ.160 నుంచి రూ.180 వరకు ఉంది. దాంతో పేదలు కొనలేకున్నారు. రైతు బజార్లలో కిలో రూ.160 వరకు అమ్ముతున్నా అది రెండో రకానికి చెందినది కావడంతో దానికి విముఖత వ్యక్తం చేస్తున్నారు.

ఒక్కటొక్కటిగా రేషన్ సరుకుల్లో కోత

2019లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాయితీ రేషన్ సరుకులకు ఒక్కటొక్కటిగా కోత పెడుతూ వచ్చారు. గత ప్రభుత్వ హయాంలో కార్డుదారులకు కిలో రూ.40కే, ప్రతినెలా రెండు కిలోల కందిపప్పు ఇస్తుండగా, వైసిపి ప్రభుత్వం దాన్ని కిలోకు కుదించింది. వైసిపి అధికారంలోకి వచ్చాక కందిపప్పు ధరను కిలో రూ.67 పెంచింది. రెండు కిలోల బదులు కిలో ఇవ్వడం మొదలుపెట్టింది. ఇప్పుడు అదీ ఇవ్వడం లేదు. దీంతో పేదలు అధిక ధరలకు బయట కొనుగోలు చేయలేక తెలుగు సంవత్సరం ఉగాది రోజున పేదలు పప్పన్నం తినలేని పరిస్థితి వైసిపి ప్రభుత్వంలో నెలకొంది.

సొమ్ము సర్దుబాటు చేయలేకనే..

మండలంలోని రేషన్ కార్డుదారులకు కిలో రూ.67 చొప్పున రాయితీపై కందిపప్పును ఇవ్వాల్సి ఉన్నా అది అమలు చేయడం లేదు. బహిరంగ మార్కెట్ లో కిలో రూ.170 వరకు ఉన్న నేపథ్యంలో అంతమార్జిన్‌ను రాయితీపై భరించడమంటే ప్రభుత్వానికి భారం కావడం వల్లే, ఒక్కటొక్కటిగా కోతపెట్టేస్తున్నారనే ఆరోపణలున్నాయి.పేదల కష్టాలకు గాలికొదిలేసిన ప్రభుత్వ యంత్రాంగం ఇప్పటికైనా ప్రత్యేక చొరవ తీసుకుని కందిపప్పు అందించాలని కార్డుదారులు కోరుతున్నారు.

ప్రజానుకూల, ప్రత్యామ్నాయ విధానాలకై సిపిఎం అభ్యర్థులను గెలిపించండి

ఆ పార్టీ రంపచోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి లోతా రామారావు

ప్రచారం సందర్భంగా గిరిజనులతో మాట్లాడుతున్న సిపిఎం అభ్యర్థి లోతా రామారావు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

ప్రజానుకూల, ప్రత్యామ్నాయ విధానాల కోసం రంపచోడవరం శాసనసభ, అరకు పార్లమెంట్ నియోజకవర్గాల నుండి సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం (ఇండియా) ఉమ్మడి వేదిక తరుపున రంపచోడవరం నియోజకవర్గం నుండి పోటీ చేస్తున్న సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి లోతా రామారావు విజ్ఞప్తి చేశారు. సిపిఎం మండల నాయకులు కొండ్ల సూరిబాబు ఆధ్వర్యాన మండలంలోని పలు గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా లోతా రామారావు మాట్లాడుతూ, 2014 నుండి అధికారంలో ఉన్న బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం ధరలు తగ్గించేందుకు జీఎస్టీ చట్టం తెస్తున్నామని చెప్పిందని, జీఎస్టీ చట్టం వచ్చాక నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయని పేర్కొన్నారు. ప్రజలపై భారాలు మోపిందని, చివరికి పసిపిల్లలు తాగే పాల డబ్బా నుండి ప్రాణాలు నిలిపే మందులు వరకు, ఆఖరుకు అంతిమ సంస్కారాలకు వాడే శవపేటికలపైనా పన్నులు వేసిందని విమర్శించారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత పెట్రోల్, డీజిల్ ధరలు రెట్టింపయ్యాయని, వంటగ్యాస్ ధర రెండింతలు పెరిగిందని తెలిపారు. ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని హామీ ఇచ్చిన నరేంద్ర మోడీ, కొత్త ఉద్యోగాలు ఇవ్వకపోగా, ఉన్న ఉద్యోగాలనే ఊడగొట్టి యువతను నట్టేట ముంచాడని పేర్కొన్నారు. నరేంద్ర మోడీ రాజకీయ అధికారం కోసం మత విద్వేశాలు రెచ్చగొట్టి దేశ ప్రజల మధ్య నిలువునా చీలిక తెస్తున్నాడని విమర్శించారు. మోడీ, బిజెపి ప్రభుత్వ విధానాలను ప్రజలు ఓడించాలని పిలుపునిచ్చారు.

రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ నరేంద్ర మోడీకి కుడి, ఎడమగా వ్యవహరిస్తున్నారని, రాష్ట్రానికి నరేంద్ర మోడీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అడిగే దమ్ము ధైర్యం వీరికి లేదని విమర్శించారు. దేశంలోగాని, రాష్ట్రంలో గాని ఈ పదేళ్లలో ఒక కొత్త పరిశ్రమ నెలకొల్పిన దాఖలాలు లేవన్నారు. కాని నరేంద్ర మోడీ, జగన్మోహన్ రెడ్డి లక్షల కోట్లు అప్పులు చేశారని, ప్రజలపై పన్నుల భారాలు వేస్తున్నారని తెలిపారు. ఇటువంటి నికృష్టలను, ప్రజా ద్రోహులను ఓటు అనే ఆయుధంతో ఇంటికి సాగనంపే రోజు వచ్చిందని, కనుక ఆలోచించి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. నిరంతరం పేద ప్రజలు, కార్మికులు, గిరిజనులు సమస్యలు పరిష్కారం కోసం, ఆదివాసీల హక్కులు, చట్టాలు పరిరక్షణ కోసం, పనిచేసే సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇంటింటి ప్రచారం సందర్భంగా ఆయా ప్రాంతాలలో ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం. రమేష్, జె రాజు, పి సత్యనారాయణ, పాండవుల సత్యనారాయణ, పి పాపారావు, కె జగన్నాథం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం అభ్యర్థులను చట్ట సభలకు పంపుదాం

విఆర్.పురం : ప్రజా సమస్యలపై నిరంతరం గొంతెత్తి, గళం విప్పే సిపిఎం అభ్యర్థులను వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో గెలిపించి చట్టసభలకు పంపుదామని సిపిఎం మండల కార్యదర్శి సోయం చినబాబు, జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ ప్రజలకు పిలుపునిచ్చారు. మండలంలోని తమ్మయ్యపేట, గుర్రంపేట గ్రామాలలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశాల్లో చినబాబు, సత్యనారాయణ మాట్లాడుతూ చట్టసభల్లో సిపియం ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు ఉంటే పోలవరం నిర్వాసిత సమస్యలు, గిరిజన చట్టాలు, జిఒ3 పునరుద్ధరణ వంటి సమస్యలు నిజాయితీగా రాజీలేని పోరాటాలు నిర్వహించి ప్రజావాణిని సభల్లో వినిపిస్తారని తెలిపారు. ఈ సమావేశాల్లో సర్పంచ్ వెట్టి లక్ష్మి, సిపిఎం నాయకులు కారం సత్తిబాబు కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

గిరిజనులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు సోయం చినబాబు, పూనెం సత్యనారాయణ

ఘనంగా ఉగాది వేడుకలు

ప్రజాశక్తి -సీలేరు

తెలుగు సంవత్సరాది ఉగాది ఉత్సవాలు అంగరంగ వైభవంగా మంగళవారం మన్యం వాసులు జరుపుకున్నారు. జీకే వీధి మండలం సీలేరు, దారకొండ, దుప్పిలివాడ, గుమ్మరేవులు పంచాయతీ గిరిజనులు, ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు ప్రజలు తమ ఆచార సంప్రదాయాల ప్రకారంగా కొత్త సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. భక్తులు మారమ్మ అమ్మవారు, ఆంజనేయస్వామి, వెంకటేశ్వర స్వామి తదితర దేవాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. షడ్రుచుల ఉగాది పచ్చడిని ఇంటింటా తయారు చేసి, పరస్పరంగా ఉగాది శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వేద పండితులు పంచాంగ శ్రవణం చేశారు.

వాహన తనిఖీలు చేస్తున్న రాజవొమ్మంగి సిఐ సన్యాసినాయుడు, ఎస్ఐ తదితరులు

ముమ్మరంగా వాహన తనిఖీలు

ప్రజాశక్తి--రాజవొమ్మంగి

మండలంలోని కింద్ర జంక్షన్ వద్ద రాజవొమ్మంగి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎన్.సన్యాసి నాయుడు ఆధ్వర్యంలో పోలీసులు ముమ్మరంగా వాహనాలు తనిఖీలు నిర్వహించారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్న దృష్ట్యా వాహన తనిఖీలు చేపట్టారు. కారులు, ఇతర వాహనాల డిక్కీలు తనిఖీ చేశారు. నగదు, సారాయి, మద్యం, గంజాయి, మారక ద్రవ్యాలు అక్రమ రవాణా నివారించడంలో భాగంగా తనిఖీలు చేపట్టినట్లు సీఐ తెలిపారు. ఏలేశ్వరం నుండి నర్సీపట్నం రహదారి మీదుగా వచ్చి పోయే ప్రతీ వాహనాలను ఆపి నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వాహనదారులతో సిఐ సన్యాసి నాయుడు మాట్లాడుతూ, వాహనదారులు ఎన్నికల నియమ నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో రాజవొమ్మంగి ఎస్ఐ ఎస్.వెంకయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రామాలయం రోడ్డుకు కలపాలి

ప్రజాశక్తి-చింతూరు

చింతూరు మండల కేంద్రంలోని సినిమా హాలు వెనుక వైపు ఉన్న గుబేలుపేట, గొల్లబజారు వీధుల్లో సిసి రోడ్డు నిర్మాణం చేసి, దానిని రామాలయం రహదారికి కలపాలని స్థానికులు కోరుతున్నారు. ప్రతి ఏటా వరదలు ముంచెత్తినప్పుడు ఈ రెండు వీధుల ప్రజలు సురక్షిత ప్రాంతం ఎర్రంపేటకు తరలి వెళ్లేందుకు రామాలయం రోడ్డే ప్రధాన ఆధారం. సిసి రోడ్డు వేసి, రామాలయం రోడ్డుకు కలిపితే వరద బాధితులు తరలి వెళ్లేందుకు అవకాశం ఉంటుంది. సుమారు 500 కుటుంబాలు వరదల సమయంలో ఈ రహదారి నుండే బయటకు వెళ్లాల్సి ఉంటుంది. కేవలం 50 మీటర్లు మేరకు సిసి రోడ్డు వేసి, దానిని రామాలయం రహదారికి కలపమని అధికారులను, ప్రజాప్రతినిధులను ఐదేళ్లుగా వేడుకున్నా ఫలితం లేకుండా పోయింది. ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిధులు ఈ రహదారి యొక్క అవసరాన్ని ప్రాముఖ్యతను దృష్టిలో పెట్టుకొని రోడ్డు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

సిసి రోడ్డు వేసి రామాలయం రహదారికి కలపాల్సిన దారి ఇదే..

'గిరి' గ్రామాల్లో తాగునీటికి కటకట

-పడకేసిన మంచినీటి పథకాలు, బోర్లు
-అడుగంటిన ఊటకుంటలు, భూగర్భ జలాలు
-గుక్కెడు నీటి కోసం చెట్లు, గుట్టల వెంబడిపరుగులు.
-కలుషిత నీటితో కష్టాల పాలౌతున్న మన్యవాసులు

ప్రజాశక్తి - అరకులోయ రూరల్: ఏజెన్సీ గిరిజన గ్రామాల్లో ప్రజలు ఏటా తాగునీటి తంటాలు తప్పడం లేదు. అసలే వేసవి కాలం కావడంతో ఆదివాసీల మండుటెండల్లో గుక్కెడు నీటి కోసం పడరాని పాట్లు పడుతున్నారు. చెంబుడు నీటి కోసం చెట్లు, గుట్టలు వెంబడి పరుగులు తీయాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్ని చోట్ల ప్రభుత్వం ఏర్పాటు చేసిన నీటి పథకాలు మరమ్మతుకు గురై దర్శనమిస్తున్నాయి. అనేక బోర్లు పాడవ్వగా, భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో కొన్ని బోర్లు సీజనల్‌గా మారి నీరివ్వడం లేదు. దీంతో గిరిజన గ్రామాలలో ప్రజల కు మంచినీటి ఇబ్బందులు తప్పడం లేదు.ఈ పరిస్థితి అరకులోయ మండలంలోని బస్కీ పంచాయితీ మారుమూల గ్రామాలైన బిజగుడ, కొంత్రాయిగూడ, కంజరితోట, గిరిలిగూడ గ్రామాల్లో తీవ్రంగా ఉంది.

ప్రస్తుం వేసవి కాలంలో గ్రావిటీ పథకాలు కుళాయిల్లో పూర్తిగా మీరు ఇంకిపోతుండడంతో, మన్యవాసులకు ఊటనీరే శరణ్యమౌతోంది. ఎండల తీవ్రతకు ఊటకుంటలు, బావులు సైతం అడుగంటి పోవడం, ఇంకిపోవడంతో కొద్దిపాటి కలుషిత నీటితో అవసరాలను తీర్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. అధికారులు ప్రజా ప్రతినిధులు తాగునీరుపై కనీసం స్పందన లేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికి తాగు నీరు అందిస్తున్నామని చెబుతున్నప్పటికీ ఈ పథకం ఎక్కడ కూడా అమలు అయ్యే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో ట్యాంక్ నిర్మాణం చేసి ఏడాది గడుస్తున్నా నేటికీ మంచి అందించే పరిస్థితి లేదని అధికారులకు ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించిన పట్టించుకునే పరిస్థితి లేదని గిరిజనులు వాపోతున్నారు.

బిజగుడ గ్రామాల్లో 35 పిపీవీటిజి కుటుంబాలు నివశిస్తున్నారు. గ్రామాల్లో గ్రావిటీ స్కీంతో కొళాయి ఉనప్పటికీ నీరు ఇంకిపోయింది దీంతో పొలం వద్ద ఊటనీరు తీసుకొచ్చి తాగుతున్న పరిస్థితి నెలకొంది. కొంత్రాయిగూడ గ్రామంలో 37 కుటుంబాలు గ్రావిటీ పథకం ం నీటి ఇంకిపోవడం తో బోరు బావిలో ఉన్న బురద నీరు తాగుతున్నారు.కొరగూడ గ్రామాల్లో 40 ప్రభుత్వం బోరు వేసి ఏళ్ళు గడుస్తున్న ఇప్పటి వరకు కుళాయి కనెక్షన్లు ఇవ్వడలేదు. దీంతో తాగు నీరు ఇబ్బందులు పడుతున్న పరిస్థితి. కంజరితోట గ్రామంలో 47 కుటుంబాలు నివశిస్తున్నారు.తాగునీటి లేక తీవ్ర ఇబ్బందుల పడుతున్న పరిస్థితి నెలకొంది. ఎన్నికలు సమయంలోనే తప్ప, తర్వాత పత్తా లేకుండా పోయిన రాజకీయ నేతలు గెలిచినా, ఓడినా తమ గోడు పట్టించుకోవడం లేదనిగిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి బస్కి పంచాయతీ వివిధ గ్రామాల్లో తాగునీరు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు చేస్తున్నారు.

కొంత్రాయిగూడలో తాగునీరు కోసం పడిగాపులు పడుతున్న గిరిజన మహిళలు

కొర్రగూడ గ్రామంలో మొండిగా దర్శనమిస్తున్న బోరు

గెలిపిస్తే గిరిజనం గొంతునౌతా!

- జిఒ3 పునరుద్ధరణలో ప్రభుత్వ వైఫల్యం
- వైసిపి, టిడిపిలకు ఓటేస్తే బిజెపికి వేసినట్టే
- విస్తృత ప్రచారంలో అరకు సిపిఎం ఎంపీ అభ్యర్థి అప్పలనర్స

ప్రచారంలో మాట్లాడుతున్న సిపిఎం అరకు ఎంపీ అభ్యర్థి అప్పలనర్స

ప్రజాశక్తి- పెదబయలు : టిడిపి, వైసిపిల పాలనలో ఆదివాసీల సంక్షేమం, అభివృద్ధిలో నిండా నిర్లక్ష్యం చోటుచేసుకుందని సిపిఎం అరకు ఎంపీ అభ్యర్థి పాచిపెంట.అప్పలనర్స విమర్శించారు. రానున్న ఎన్నికల్లో ఉద్యమపార్టీ సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని కోరారు. చట్టసభల్లోకి వెళ్లే అవకాశమిస్తే గిరిజనం గొంతునౌతానని భరోసానిచ్చారు. మంగళవారం మండలంలోని రూడకోట పంచాయతీ బడంబీర్, పెద్దలోవ, దూళిపుట్టు నందిమెట్ట, గొర్రెలమెట్ట, గిద్దులమెట్ట, సరసంగి, రూడగోమంగి, తురంగుల తుమ్మలపనస, ముఖిపుట్టు తదితర గ్రామాల్లో సిపిఎం అరకు ఎమ్మెల్యే అభ్యర్థి దీసరి గంగరాజు, సుమారు 500 మంది పార్టీ అభిమానులు, కార్యకర్తలతో వెళ్లి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. సిపిఎం అభ్యర్థులైన తమకు సుత్తి కొడవలి గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.

ఈ సందర్భంగా అప్పలనర్స మాట్లాడుతు, ఏజెన్సీలో వందశాతం ఉద్యోగాలు గిరిజనులకే దక్కేలా ఉన్న జిఒ3 పునరుద్ధరణలో వైసిపి ప్రభుత్వం పూర్తిగా విఫలం చెంది, గిరి యువతకు తీరని అన్యాయం చేసిందన్నారు. జిఒ3ను సుప్రీంరద్దుచేసి మూడేళ్లయినా దీనిపై రివ్యూపిటిషన్‌గానీ, పిల్‌గానీ వేయకుండా నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. టిఎసిలో తీర్మానం చేసినప్పటికీ, వైసిపి అసమర్థత వల్లే, దాన్ని గవర్నర్ రాష్ట్రపతిల అమోదానికి పంపకుండా గిరిజనులకు అన్యాయం చేసిందన్నారు.

బోయ/వాల్మీకులు, బెంతుఒరియాలను ఎస్‌టి జాబితాలో చేరుస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయడం ద్వారా ఆదివాసీల ఉనికికి వైసిపి ప్రభుత్వం ప్రశ్నార్థకం చేస్తోందన్నారు.ఏజెన్సీలోని సహజసంపదను కొల్లగొట్టడానికి ఆదానీ, అంబానీ వంటి బడా కంపెనీలకు అండగా నిలుస్తూ, హైడ్రో పవర్ ప్రాజెక్టుల ఏర్పాటుకు కేంద్రంకుట్ర చేయడం, కేంద్ర హోంశాఖ సహాయమంత్రి కిషన్‌రెడ్డి స్వయంగా ఆదివాసీ సంపదను కొల్లగొట్టే కుట్రలో భాగం కావడం దుర్మార్గమన్నారు. రూడకోట పంచాయతీ బాడంబీర్‌లో రూ.9.50లక్షలు ఖర్చుపెట్టి బోరు తవ్వించినా చుక్క నీరు అందించలేని దుస్థితి నెలకొందని, జలజీవన్ మిషన్ పథకంపూర్తిగా అవినీతి, అక్రమాల మయమై పోయిందన్నారు. దీనిపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని అప్పలనర్స డిమాండ్ చేశారు. కనెక్టివిటీ పాడేరు పేరుతో రహదారులు నిర్మించకుండానే పంచాయతీరాజ్, గిరిజన సంక్షేమశాఖలు కోట్లాది రుపాయల ప్రజాధనాన్ని దారి మళ్లించాయన్నారు. అవినీతి, అక్రమాలు, విధ్వంసాలను ప్రోత్సాహించేలా వైసిపి పాలన సాగిందని మండిపడ్డారు. రూడకోట కుమాడా వయా కొరవంగి మీదుగా పాడేరుకు ఆర్‌టిసి బస్సు పునరుద్ధరిస్తే సుమారు 160 గ్రామాలకు రవాణా సౌకర్యం అందించే అవకాశం ఉన్నా, అధికారులు, ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం గిరిజనుల పట్ల వారికున్న చిత్తశుద్ధిని స్పష్టం చేస్తున్నాయన్నారు.

టిడిపి, వైసిపిలకు ఎవరికి ఓటేసినా, అది కేంద్రంలోని బిజెపికి ఓటేసినట్టేనని, గడచిన పదేళ్ల మోడీ పాలనలో కేంద్ర ప్రభుత్వ ప్రతి నిర్ణయానికీ సైఅంటూ రాష్ట్ర ప్రభుత్వాలు అమలుకు పూనుకోవడమే దీనికి నిదర్శనమన్నారు. ఏజెన్సీ ప్రాంతాన్ని కారుచౌకగా కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు బిజెపి కుట్రలో భాగంగానే కనీసం ఓట్లు లేని అరకులోయ ప్రాంతంలో బిజెపి తన అభ్యర్థులను పోటీ బరిలోకి దింపిందన్నారు. దీనికి టిడిపి, జనసేనను దన్నుగా నిలుస్తున్నాయని, మన్యవాసులంతా గమనించి, విచక్షణతో ఓటేయాలని అభ్యర్థించారు. గిరిజనులతోనే ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి పోరాటాలు, ఉద్యమాలు చేస్తున్న పోరాట పార్టీ సిపిఎం అభ్యర్థులను అరకు ఎంపీ ఎమ్మెల్యే స్థానాల్లో మంచి మెజార్టీతో గెలిపించాలని అప్పలనర్స అభ్యర్థించారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కిల్లో సురేంద్ర, మండల నాయకులు జంపరంగి సునీల్‌కుమార్, కె శరబన్న, పప్పుల బుజ్జిబాబు, ముంచింగి పుట్టు మండల సిపిఎం నేతలు జి.జీనబంధు, గల్లెల నారాయణ, పెద్దసంఖ్యలో పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

అమానుషం!

- చేతిలో బిడ్డ మృతదేహంతో అర్ధరాత్రి వేళ కాలినడకన గ్రామానికి చేరుకున్న గిరిజన దంపతులు
- అనంతగిరి మండల చినకోనల శిఖర గ్రామంలో ఘటన

సొయ్యగ్రామానికి బిడ్డ మృతదేహాన్ని తరలిస్తున్న తల్లిదండ్రులు

ప్రజాశక్తి - అనంతగిరి : రెండేళ్ల బాలుడి మృతదేహంతో గిరిజన దంపతులను అర్ధరాత్రి వేళ ఊరుగాని ఊరిలో నిర్ధాక్షిణ్యంగా వదిలేసి అమానుష ఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. బిడ్డ మృతదేహంతో దాదాపు ఎనిమిది కిలోమీటర్లు దూరం అడవిమార్గంలో కాలినడకన సొంతూరు చేరుకున్న గిరిజన దంపతుల బాధ వర్ణనాతీతం. హృదయవిదారక ఈ ఘటనకు సంబంధించిన వివరాలివి. దీనిపై సేకరించిన అనంతగిరి మండలం మారుమూల కొండశిఖర కొంపల్లి పంచాయతీకి చెందిన సారా కొత్తయ్య దంపతులు పొట్టకూటి కోసం నెలరోజుల క్రితం గుంటూరు ప్రాంతానికి వలస వెళ్లారు. భార్యాబిడ్డలతో గుంటూరు ప్రాంతానికి వెళ్లిన కొత్తయ్య, అక్కడ ఇటుకలబట్టీలో పనికి చేరాడు. వీరి కుమారుడు రెండేళ్ల సారా ఈశ్వరరావుకు అనారోగ్యం చేయడంతో అక్కడ ప్రయివేటు ఆసుపత్రిలో వైద్యం చేయించారు. అయితే ఆరోగ్యం విషమించడంతో అక్కడ ఆసుపత్రిలో మృతి చెందాడు. ఇటుకల బట్టీల యజమానులు బాబు మృతదేహంతో గిరిజన దంపతులను ప్రయివేటు అంబులెన్స్‌లో తీసుకొచ్చి, వారి స్వగ్రామానికి చేరవేయకుండా, మార్గమధ్యలో అర్ధరాత్రి వేళ దించేసి వెళ్లిపోయారని బాధిత దంపతులు కన్నీరుమున్నీరుగా విలపిస్తూ తెలిపారు. బాలుడి మృతదేహంతో గుంటూరు జిల్లా రావులపాలెం లో మంగళవారం రాత్రి 9గంటల సమయంలో అంబులెన్స్‌లో బయలుదేరిన వీరిని, విజయనగరం జిల్లా మెంటాడ మండలం వనజ గ్రామం వద్ద అర్ధరాత్రి రెండు గంటల సమయంలో దించి వెళ్లిపోయారు. అక్కడ నుంచి తమ స్వగ్రామం చిన్నకోనల వెళ్లేందుకు కనీసం రహదారిగానీ, రవాణా సౌకర్యంగానీ లేనిపరిస్థితుల్లో చిమ్మచీకట్లోనే బిడ్డ మృతదేహన్ని చేతుల్లో పట్టుకుని బాధిత దంపతులు కొండమార్గంలో నడుస్తూ ఇంటికి చేరుకున్నారు. మంగళవారం బాబు మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

కాగా స్థానికంగా ఉపాధి కరువై పొట్టకూటి కోసం వలస వెళ్లే పరిస్థితులు గిరిజన గ్రామాల్లో నెలకొనడం ఒకటైతే, వలస వెళ్లిన చోట అనారోగ్యం పరిస్థితుల్లో నివాసముండడం, రోగాల బారిన పడి ఇలా మృత్యువాత పడడం వంటి దౌర్భాగ్య పరిస్థితులు నెలకొనడం మరీ దారుణం. ఇదంతా ఒక ఎత్తయితే, తమ ఇటుకల బట్టీలో పనిచేసే కూలీ కుటుంబానికి చెందిన బిడ్డ మృతి చెందితే, అమానుషంగా మార్గమధ్యలో వదిలేసి వెళ్లిపోవడం హృదయవిదారకరం. రోడ్డు, రవాణాలేని తమ గ్రామానికి బిడ్డ మృతదేహన్ని చేతులపైనే తీసుకెళ్లాల్సిన స్థితి ఇంకా విచారకరం. గిరిజన గ్రామాల్లో గిరిజన జీవన స్థితిగతులు ఎప్పటికి మెరుగుపడతాయోనని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే సమయంలో బిడ్డ మృతదేహంతో గాల్లోనే వదిలి వెళ్లిన ఇటుకబట్టీల యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి ఎస్, నాగులు కార్యకర్తలు బి సంహచలం ,ఎస్ ,అప్పాలరాజు ,పోలయ్య డిమాండ్ చేశారు

తారెత్తిస్తున్న ఎండలు..

చింతూరులో 41.7 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత

ప్రజాశక్తి-పాడేరు టౌన్: భానుడు ఉగ్రరూపం దాల్చారు. అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు పట్టణం మంగళవారం మండిన ఎండలతో వేడెక్కింది. ఉదయం 11 గంటలు దాటగానే చాలా రహదారులు ఖాళీగా దర్శనమిచ్చాయి. అత్యవసరంగా బయటకు వెళ్లాల్సి వస్తే స్కార్ఫ్, వాటర్ బాటిల్, గొడుగులు వెంట తీసుకెళ్తున్నారు. ఇవేం ఎండలు.. ఇప్పుడు ఇలా ఉంటే ఏప్రిల్ నెలాఖరు, మే, జూన్ మొదటి వారం వరకు ఎలా ఉంటాయోనని జనం బెంబేలెత్తిపోతున్నారు. బయట నిప్పులు జరుగుతున్న సూర్యుడు..ఇంట్లో ఉంటే ఉక్కపోతతో ఒక్కరి బిక్కిరి అవుతున్నారు డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత. తగు జాగ్రత్తలు తీసుకోకుండా బయటకు వెళ్ళవద్దని వాతావరణ శాఖ అధికారులు, వైద్యులు హెచ్చరిస్తున్నారు. మంగళవారం అత్యధికంగా చింతూరులో 41.7డిగ్రీల సెంటిగ్రేడ్ గరిష్ట ఉష్ణోగ్రత నమోదుకాగా, దేవీపట్నంలో 40.9, కూనవరంలో 40.6, గంగవరంలో 40.2, అడ్డతీగల 37.9, అనంతగిరి 32.3, అరకు వ్యాలీ 32.6, నెల్లిపాక 38.8, చింతపల్లి 35.2, డుంబ్రిగూడ 33,6, జీకే వీధి 36.8, జి మాడుగుల 36.1, హుకుంపేట 32.4, కొయ్యూరు 38.1, మారేడుమిల్లి 37.6, ముంచంగిపుట్టు 33.7, పాడేరు 38.7 పెదబయలు 33.6, రాజవొమ్మంగి 38.0 రంపచోడవరం 37.5 విఆర్ పురం 36.8 వై రామవరం 36.4 డిగ్రీల సెంటీగ్రేడ్ చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి

చంద్రబాబు సమక్షంలో టిడిపిలో చేరిన సీతంరాజు సుధాకర్

టిడిపిలోకి విశాఖ దక్షిణం నేతలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

వైసిపికి కొద్ది నెలల క్రితం రాజీనామా చేసిన రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ సీతంరాజు సుధాకర్ టిడిపిలో చేరారు. మంగళవారం మంగళగిరిలోని టిడిపి కార్యాలయంలో ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు సుధాకర్ మెడలో పసుపు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. సుధాకర్‌తో పాటు జివిఎంసి 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, 29వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి నారాయణరావు, పూర్ణా మార్కెట్ సమీపంలోని శ్రీ దుర్గాలమ్మ దేవస్థానం ధర్మకర్త బత్తి మంగరాజు, గరుడ సత్రం ధర్మకర్త చరకం మణమ్మ, స్థానిక నాయకులు కంటిపిల్లి వరలక్ష్మి, వైసిపి 35వ వార్డు వర్కింగ్ ప్రెసిడెంట్ గౌరీ శంకర్, వర్తక సంఘం సభ్యులు రామిరెడ్డి, నిమ్మ శ్రీనివాస్, ముక్కు శ్రీనివాస్ తదితరులు విశాఖ దక్షిణ నియోజకవర్గం నుంచి టిడిపిలో చేరిన వారిలో ఉన్నారు. సుధాకర్ విశాఖ దక్షిణ నియోజకవర్గం నుంచి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయాలని భావించి వార్డుల్లో రెండేళ్లుగా పలు కార్యక్రమాలు చేపడుతూ వచ్చారు. ఈ నియోజకవర్గం నుంచి ఆయనకు టికెట్ కేటాయించకుండా సిట్టింగ్ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్‌వైపే వైసిపి అధిష్టానం మొగ్గు చూపింది. ఈ క్రమంలోనే సుధాకర్ కొద్ది నెలల క్రితం అధికార పార్టీకి రాజీనామా చేశారు. ఆయన గత ఏడాది జరిగిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికల్లో వైసిపి బలపరిచిన అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందిన విషయం తెలిసిందే.

ఆలయాలు కిటకిట

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : శ్రీ క్రోధీ నామ సంవత్సరం ఉగాది వేడుకలను దక్షిణ నియోజకవర్గంలోని దేవాలయాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్, మేయర్ గొలగాని హరి వెంకట కుమారితో పాటు, వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు. ఆలయాలను సందర్శించి వేడుకలలో సందడి చేశారు. ఆలయాల దర్శనాలకు భక్తులు పోటెత్తారు. తెలుగు సంవత్సరాది వేళ యువత సంప్రదాయ దుస్తులు ధరించారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ముఖ్యంగా నగరంలోని సంపత్ వినాయగర్, శ్రీ కనకమాలక్ష్మి అమ్మవారి దేవస్థానం, దొండపర్తిలోని శ్రీ ఎరుకుమ్మవారి దేవస్థానం ఆలయాలు కిటకిటలాడాయి. ఆలయాలను పుష్పాలతో అలంకరించారు. పలు ఆలయాల వద్ద అన్నదాన కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించారు. పలు చోట్ల కొన్ని సంస్థలు ప్రత్యేకంగా ఉగాది వేడుకలు నిర్వహించాయి. సంప్రదాయ దుస్తుల పోటీ, వంటకాల పోటీలు నిర్వహించి పాల్గొన్న వారికి బహుమతులు అందజేశాయి. వివిధ రాజకీయ పార్టీల కార్యాలయాల్లో, దేవాలయాల్లో, స్వచ్ఛంద సంస్థల కార్యాలయాల్లో పంచాంగ శ్రవణం నిర్వహించారు.

జోరుగా వాసుపల్లి ప్రచారం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ దక్షిణ నియోజకవర్గంలో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్ కుమార్ జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. మంగళవారం తన కార్యాలయంలో ముస్లింలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిలకడలేని పవన్, చంద్రబాబు కుటిల రాజకీయాలపై ప్రజలు విస్తుపోతున్నారన్నారు. సంక్షేమ పథకాలే తమను గెలిపిస్తాయని చెప్పుకొచ్చారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ మైనార్టీ విభాగం అధ్యక్షులు ముజీబ్ ఖాన్, కమల్, ఇబ్రహీం, సిలార్, సలీం, అమీర్ మామ పాల్గొన్నారు. అలాగే 39వ వార్డు వన్‌టౌన్ ప్రాంతంలోగల శ్రీ స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు మద్దతు కోరుతూ వాసుపల్లి గణేష్ కుమార్ మంగళవారం సంస్థ కార్యాలయానికి వెళ్లారు. ఆయనకు స్వచ్ఛంద సంస్థ సభ్యులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షురాలు, శ్రీ కనకమహాలక్ష్మి దేవస్థానం ఛైర్మన్ కొల్లి సింహాచలం, స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజలు కలివిడితత్వంతో ముందుకు సాగాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : 'తెలుగు జాతి మొత్తం కలిసికట్టుగా చేసుకునే పండగ ఉగాది. ఆ స్ఫూర్తిని కాపాడుతూ అందరూ ఐక్యంగా ముందుకు సాగాలి. కలివిడితత్వంతో ముందుకెళ్లాలి' అని విశాఖ జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. నగరంలోని వుడా చిల్డ్రన్ ఎరీనాలో జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జివిఎంసి కమిషనర్ సిఎం సాయికాంత్ వర్మ, ఎడిసి కెఎస్.విశ్వనాథన్, ఇతర ప్రముఖులు హాజరయ్యారు. అనంతరం అతిథులందరూ పంచాగంలో పేర్కొన్న విశేష అంశాలను ఆద్యంతం ఆసక్తిగా విన్నారు. పంచాంగ కర్త రొంపిచర్ల సింగరాచార్యులు పంచాగ శ్రవణం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ సంప్రదాయాలను, తెలుగు మూలాలను మర్చిపోకుండా వేడుకలను నిర్వహించుకోవాలని పేర్కొన్నారు.

ఉగాధి వేడుకల్లో విశాఖ కలెక్టర్ మల్లికార్జున, పలు విభాగాల అధికారులు

ఉగాది వేడుకల్లో భాగంగా సందేశాన్ని అందించిన ఆయన జిల్లా ప్రజలు సుఖ సంతోషాలతో, సిరి సంపదలతో తులతూగాలని ఆకాంక్షించారు. కులమతాలకు అతీతంగా తెలుగు జాతి మొత్తం కలిసికట్టుగా చేసుకునే పండగ ఉగాది అని పేర్కొన్నారు. విశిష్ట సేవలందించిన వారికి ఉగాది పురస్కారాలు అందజేశారు. పోర్టు ఏరియా పరిధిలోని శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో పని చేస్తున్న కె.అనంత వెంకట వరహా కష్ణమాచార్యులు, పద్మనాభం మండలం పెంట గ్రామంలోని కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో పని చేస్తున్న బి.బుచ్చమ్మ, ఆనందపురం మండలం కొల్లివానిపాలెం గ్రామ పరిధిలోని రామాలయంలో సేవలందిస్తున్న వి.నరహింహాచార్యులు, బురుజుపేటలోని శ్రీకనక మహాలక్ష్మి దేవస్థానంలో పని చేస్తున్న ప్రధాన అర్చకులు కొడమంచిలి శ్రీనివాసశర్మ, అర్చకులు వాడపల్లి గోపాలాచార్యులు, సామవేద పండితులు కోటా పంచముఖి శర్మ ఉగాది పురస్కారాలను అందుకున్నారు. వారికి ఒక్కొక్కరికీ రూ.10,116 విలువగల చెక్కులను కలెక్టర్ అందించారు. వేడుకల్లో జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, విశాఖ, భీమిలి ఆర్‌డిఒలు హుస్సేన్ సాహెబ్, భాస్కరరెడ్డి, టూరిజం ఆర్‌డి శ్రీనివాస ఫణి, దేవాదాయ శాఖ డిసి శిరీష, విఎంఆర్‌డిఎ జెసి రవీంద్ర, యుసిడి పీడీ పాపునాయుడు, ఎస్టేట్ అధికారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

14 నుంచి శ్రీ కరకచెట్టు పోలమాంబ వార్షికోత్సవం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : 14 గ్రామాల ఆరాధ్య దైవంగా పేరొందిన పెద్దవాల్తేరులోని శ్రీశ్రీశ్రీ కరకచెట్టు పోలమాంబ అమ్మవారి ఆలయ వార్షిక జాతర మహోత్సవాలు ఈ నెల 14వ తేదీ నుండి వచ్చే నెల 14వరకు నెల రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కె.గాయత్రి తెలిపారు. ఉత్సవాల నిర్వహణపై భీమునిపట్నం రెవిన్యూ డివిజనల్ ఆఫీసర్ తరపున సీతమ్మదార తహశీల్దార్ శ్రీరామమూర్తి అధ్యక్షతన వివిధ విభాగాల అధికారులతో దేవస్థానంలో సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. వారు తీసుకున్న నిర్ణయం మేరకు.. ఈ నెల 14న చాటింపుతో పండగ మొదలవుతుంది. 15న పందిరి రాట మహోత్సవం జరుగుతుంది. అదే రోజు సోమవారం (పుట్ట బంగారం) అమ్మవారి దేవర పండగను ఘనంగా నిర్వహిస్తారు. 22న తొలేళ్ళ ఉత్సవం, 23న అనుపు ఉత్సవం ఉంటాయి. 30న మంగళవారం మారువారం పండుగను నిర్వహిస్తారు. మే 4న శనివారం మధ్యాహ్నం 12 గంటలకు మహా అన్నదాన కార్యక్రమం జరుగుతుంది. ఉత్సవాలు జయప్రదం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేయనున్నారు. భక్తులకు ఉచితంగా తాగునీరు, మజ్జిగ పంపిణీ చేస్తారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేస్తారు. ఎండ వేడిమి నేపథ్యంలో టెంట్లు వేయదలిచారు. అమ్మవారి జాతర మహోత్సవం వైభవంగా జరగడానికి అన్ని విభాగాల అధికారులు సహకరించాలని ఆలయ ఇఒ కె.గాయత్రి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ కె.శిరీష, జోన్ 1 ట్రాఫిక్ ఎసిపి, పోలీస్, జీవీఎంసీ, విద్యుత్, ఫైర్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

హైదరాబాద్-కటక్ మధ్య ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రయాణికుల రద్దీ దృష్ట్యా హైదరాబాద్ - కటక్ మధ్య ప్రత్యేక రైలు సర్వీసులను నడపాలని రైల్వే శాఖ నిర్ణయించింది. ఈ క్రమంలో 07165 హైదరాబాద్-కటక్ ప్రత్యేక రైలు ఏప్రిల్ 16, 23, 30 తేదీల్లో ప్రతి మంగళవారం రాత్రి 20.10 గంటలకు హైదరాబాద్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 09.05 గంటలకు దువ్వాడ చేరుకుని మరలా 09.07 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి సాయంత్రం 17.45 గంటలకు కటక్ చేరుకుంటుంది. 07166 కటక్-హైదరాబాద్ ప్రత్యేక రైలు ఏప్రిల్ 17, 24, మే 1 తేదీలలో ప్రతి బుధవారం రాత్రి 22:30 గంటలకు కటక్ నుంచి బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 07.35 గంటలకు దువ్వాడ చేరుకుని మరలా 07.37 గంటలకు బయలుదేరి అదేరోజు రాత్రి 21.00 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది. ఈ రైళ్లు సికింద్రాబాద్, నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, అనకాపల్లి, దువ్వాడ, కొత్తవలస, విజయనగరం, శ్రీకాకుళం రోడ్, పలాస, బ్రహ్మపూర్, ఖుర్దా రోడ్, భువనేశ్వర్ మీదుగా ప్రయాణిస్తాయి.

జాతరలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు

ఘనంగా ముత్యాలమ్మ జాతర

ప్రజాశక్తి -కూనవరం

మండలంలోని మర్రిగూడెంలో ఉన్న ముత్యాలమ్మతల్లి మంగళవారం ఘనంగా జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు రావడంతో ఆలయం కిటకిటలాడింది. ఉదయం 6 గంటల నుండి కుంకుమ పూజలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు భద్రాచలానికి చెందిన కర్నాటి రామాంజనేయులు సోదరులు మంచినీటి ప్యాకెట్లు పంపిణీ చేశారు. పులిహోర, ప్రసాదాలు భీమవరానికి చెందిన భార్గవ్, వర్మ భక్తులకు అందజేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. జాతర రోడ్డు మీదే కావడంతో పోలీసులు రాకపోకలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారు.

భక్తులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న జనసేన నాయకులు

గ్రామదేవతల ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - విఆర్.పురం: తెలుగు సంవత్సరాది ఉగాదిని పుస్కరించుకుని మండలంలోని పలు గ్రామ దేవతల ఆలయాలకు భక్తులు భారీ సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలను నిర్వహించారు. రేఖపల్లి, విఆర్.పురం, శ్రీరామగిరి గ్రామాల్లో ముత్యాలమ్మ, కోట మైసమ్మ, రాజులస్వామి ముత్యాలమ్మ ఆలయాలకు భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చిన మొక్కలు తీర్చుకున్నారు. మండల వ్యాప్తంగా ఉగాది సంబరాలు అంబరాన్ని అంటాయి.

భక్తులకు జనసేన మజ్జిగ పంపిణీ

విఆర్.పురం : రేఖపల్లి చెరువు కట్టముత్యాలమ్మ ఆలయానికి వచ్చిన భక్తులకు జనసేన పార్టీ నాయకులు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు సాయికృష్ణ, నాయకులు భాగుల అంజన్‌రావు, పవన్, పెట్టా నాగేంద్రబాబు, ముంజపు సాయి, అచ్చిరాజు, యూత్ నాయకులు పెడపెట్ల పవన్ కళ్యాణ్, పరంకుశం మణికంఠ, ముంజపు సాయి, కోట్ల సాయిబాబు, పెడపెట్ల సాయిరాం, కోట్ల వినయ్ తదితరులు పాల్గొన్నారు.

20వ వార్డులో ఎంవివి పాదయాత్ర

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం ఉదయం తూర్పు నియోజకవర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవివి.సత్యనారాయణ 20వ వార్డు లాసన్స్ బే కాలనీలో పాదయాత్ర కొనసాగించారు. 85వ రోజుకు చేరుకున్న ఆయన పాదయాత్రలో వార్డు కార్పొరేటర్ ముువ్వల లక్ష్మి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.